క్లుప్తంగా

నేడు జూనోటిక్ వ్యాధులపై అవగాహన

మండవల్లి: ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా శనివారం ప్రతి పశువుల ఆస్పత్రిలో ఆవరణలో జూనోటిక్ వ్యాధులపై అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు స్థానిక ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకుడు డాక్టర్ డీవీ వరప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జూనోసిస్ డే సందర్భంగా పెంపుడు కుక్కలన్నిటికీ ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలు వేస్తారని పేర్కొన్నారు. ఇందుకు గానూ మండవల్లి మండలానికి 300 డోసులు, ముదినేపల్లి మండలానికి 300 డోసులు టీకా సరఫరా చేశామని తెలిపారు. కుక్కల పెంచుకునేవారు తమ పెంపుడు కుక్కలను విధిగా పశువైద్యశాలకు తీసుకొచ్చి యాంటీ రేబిస్ టీకాలు వేయించాలని కోరారు.

రేపు ఉచిత వైద్యశిబిరం

గుడివాడ టౌన్: గుడివాడ రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం మెగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ప్రోగ్రామ్ కన్వీనర్ సి.సూర్యచంద్రరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక కోతిబొమ్మ సెంటర్లోని డాక్టర్ టీఎల్‌పీ అండ్ ప్రభావతి గార్డెన్స్‌లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఈ శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. చిన అవుటపల్లికి చెందిన పిన్నమనేని సిద్దార్థ వైద్య కళాశాలకు చెందిన వైద్య నిపుణులు గుండె, ఊపిరితిత్తులు, మెదడు, వెన్నెముఖ తదితర ముఖ్యమైన వ్యాధులకు చికిత్స అందజేస్తారని తెలిపారు. కావున గుడివాడ, పరిసర ప్రాంత, పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలని కోరారు.

రేణుకా పరమేశ్వరుడికి అన్నాభిషేకం



పామర్రు: అంకమ్మతల్లి ఆలయంలోని రేణుకా పరమేశ్వరుడికి అన్నాభిషేక కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జేష్ట మాసం ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కొల్లా శ్రీనివాసరావు, వెంకట దేవ నాగదుర్గ భవానీ దంపతుల సౌజన్యంతో అన్నాభిషేక కార్యక్రమం జరిగిందని ఆలయ కమిటీ చైర్మన్ వరదా అప్పారావు తెలిపారు. ఆలయంలో దేవీ హోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఉమామహేశ్వరరావు, ఎం.పేరయ్య, తోట రమేష్, దుర్గాప్రసాద్, చెన్నారాయుడు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా వీర వెంకయ్య



పామర్రు: పామర్రు లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులను స్థానిక లయన్స్‌క్లబ్ సేవా భవన్‌లో జనరల్ బాడీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. నూతన అధ్యక్షుడిగా నవులూరి వీర వెంకయ్య, కార్యదర్శిగా మూగడ మధుసూదనరావు, కోశాధికారిగా డాక్టర్ గెద్దాడ విక్టర్ పాల్‌ను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న లయన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్‌లో లయన్స్ క్లబ్ పామర్రుకు మంచి గుర్తింపు ఉందన్నారు. కార్యక్రమంలో సభ్యులు డాక్టర్ బీవీ అప్పారావు, కె చంద్రశేఖర్, తోట రమేష్, బైసాని నాగేశ్వరరావు, పీఎంఎస్ ప్రసాద్, లంకపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సులభశైలిలో బోధించాలి

ముదినేపల్లి రూరల్: ప్రాథమిక విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో సులభరీతిలో బోధించాలని ఎంఈఓ కె.నరేష్‌కుమార్ అన్నారు. మండలంలోని సంఘర్షణపురం ఉర్దూ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉర్దూ పాఠ్యాంశంగా తీసుకున్న విద్యార్థులకు మరింత శ్రద్ధ చూపి బోధించాలన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని మెనూ ప్రకారం సక్రమంగా అమలు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల రికార్డులు తనిఖీ చేసి, సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

ఇసుక, మట్టి దోపిడీని అరికట్టాలి

పామర్రు: ఇసుక, మట్టి దోపిడీని అరికట్టాలని పామర్రు మాజీ ఎమ్మెల్యే డీవై దాసు ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఉచిత ఇసుక పాలసీ సులభతరం కావాలని సూచించారు. ఈ నెల 8 నుంచి ఉచిత ఇసుక పాలసీ అమల్లోకి తీసుకురావడం హర్షణీయమన్నారు. ఎలాంటి ఆటంకాలు అవరోధాలు లేకుండా ప్రజలు సులభంగా ఇసుక పొందేవిధంగా విధి విధానాలు రూపొందించాలన్నారు. గతంలో ఇసుక మట్టి దోపిడీ వలన ప్రభుత్వ ఆదాయం పక్కదారి పట్టిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కఠినమైన ఆంక్షలు విధించాలన్నారు. పంచాయతీల ఆదాయానికి గండి కొట్టిన అక్రమ మట్టి తవ్వకాలు అనేకం తన దృష్టికి వచ్చాయన్నారు. ఇటువంటి అక్రమ విధానాలన్నింటికీ ప్రభుత్వం చెక్ పెట్టాలన్నారు. పంచాయతీలోని చెరువుల్లో మట్టి తవ్వకాలు పబ్లిక్ ఆక్షన్ తప్పకుండా నిర్వహించాలని పేర్కొన్నారు.

అతిసారం ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు

జిల్లా కలెక్టర్ బాలాజీ



బల్లిపర్రులో ఏఎన్ఎంతో మాట్లాడుతున్న కలెక్టర్ డీకే బాలాజీ

బల్లిపర్రు(పామర్రు): జిల్లాలో ఎక్కడా కూడా అతిసారం ప్రబలకుండా అన్ని ముందుస్తు జాగ్రత్తలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సంబంధిత అధికారులను ఆదేశించారు. పామర్రు మండలం బల్లిపర్రు, కనుమూరు గ్రామాల్లో తాగునీటి సరఫరా పథకాలను శుక్రవారం కలెక్టర్ సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. గ్రామాల్లో కుళాయి కనెక్షన్లు, ట్యాంకులు పరిశుభ్రం, బ్లీచింగ్ స్టాకు, క్లోరినేషన్, మోటార్ లీకేజీలకు సంబంధించి కలెక్టర్ ఆరా తీశారు. జిల్లాలో వర్షాలు పడుతున్న నేపథ్యంలో వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. బల్లిపర్రు గ్రామంలోని ఉపరితల జలాశయాన్ని పరిశీలించి, ట్యాంకును శుభ్రం చేస్తున్నారా లేదా అని విచారించారు. అక్కడున్న సంబంధిత ట్యాంకుల రికార్డులను తనిఖీ చేశారు. గ్రామాల్లో ఎక్కడైనా అతిసార కేసులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కనుమూరు గ్రామంలో ఉపరితల జలాశయాన్ని పరిశీలించి అక్కడి గ్రామస్తులను విచారించారు. తాగునీరు శుభ్రంగా ఉందా లేదా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ట్యాంకును ఈ నెల 3వ తేదీన శుభ్రం చేశారని, నీరు బాగుంటుందని స్థానికులు కలెక్టర్‌కు తెలిపారు. కార్యక్రమంలో ఉయ్యూరు ఆర్డీఓ డి.రాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ శివప్రసాద్, డీపీఓ నాగేశ్వర్ నాయక్, పామర్రు తహసీల్దార్ శ్రీ పల్లవి తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

తోట్లవల్లూరు: అతిసార వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని తోట్లవల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సాయిప్రసన్న తెలిపారు. ఈ విషయమై స్థానిక పీహెచ్‌సీలో ఆమె ఆరోగ్య సిబ్బందితో కలిసి శుక్రవారం పోస్టర్లను ఆవిష్కరించారు. డాక్టర్ సాయిప్రసన్న మాట్లాడుతూ జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆగస్టు ఒకటో తేదీ వరకు అతిసార నియంత్రణ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల వయస్సున్న చిన్నారుల తల్లిదండ్రులకు అతిసారంపై ఆరోగ్య సిబ్బంది అవగాహన కలిగిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రోజులో మూడు కంటే ఎక్కువ సార్లు పిల్లలకు విరేచనాలు అయినట్లయితే అతిసారం వ్యాధిగా గుర్తించాలన్నారు. ఒక లీటర్ నీటిలో ఒక ప్యాకెట్ ఓఆర్ఎస్ కలిపి ఆ ద్రావణాన్ని, తల్లి పాలను యథావిధిగా తాగించాలని తెలిపారు. స్వచ్ఛమైన తాగునీటిని తీసుకోవటంతోపాటు వేడిగా ఉన్న ఆహార పదార్థాలను మాత్రమే తీసుకోవాలన్నారు. హెచ్‌వీ రోహిణి, ఎంపీహెచ్ఎస్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.



తోట్లవల్లూరులో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డాక్టర్ సాయిప్రసన్న

రేపు జగన్నాథుడి రథయాత్ర

ముదినేపల్లి రూరల్: రెండో పూరీగా ప్రసిద్ధి చెందిన మండలంలోని వడాలి శ్రీజగన్నాథస్వామి ఆలయానికి సంబంధించి స్వామి రథయాత్ర ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆదివారం ఉదయం ఎనిమిది గంటలకు ఆలయం నుంచి రథోత్సవం ప్రారంభమై ముదినేపల్లి చేరుకుని ముదినేపల్లి నుంచి సింగరాయపాలెం వెళ్లి అక్కడి నుంచి రాత్రి ఎనిమిది గంటలకు ఆలయానికి చేరుకుంటుందన్నారు. సుమారు 12 గంటలు పాటు సాగే ఈ రథోత్సవాన్ని స్థానిక ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ప్రారంభిస్తారని తెలిపారు. పరిసర గ్రామాల ప్రజలు ఈ రథోత్సవంలో పాల్గొనాలని కోరారు.



సుభద్రబలరామ సమేత జగన్నాథుడి విగ్రహాలు

మంత్రి మనోహర్ వ్యాఖ్యలు హాస్యాస్పదం

కోనేరుసెంటర్: గత ప్రభుత్వంలో వాహనాల ద్వారా చేపట్టిన ఇంటింటికీ రేషన్ కార్యక్రమం వలన ప్రభుత్వానికి నష్టం వస్తుందంటూ పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చేస్తున్న వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని దళిత బహుజన పరిరక్షణ సంఘం కార్యదర్శి యెగ్గోని గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. రెక్కాడితే గానీ డొక్కాడని కోట్లాది మంది పేదల కోసం గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిస్పెన్సింగ్ వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ పంపిణీ చేయటం వలన రేషన్ దుకాణాల వరకు వెళ్లలేని అనేకమంది ఇంటి వద్ద సరుకులు పొంది ప్రభుత్వం తరఫున ఎంతో సహాయాన్ని పొందారన్నారు. అలాంటి పేద ప్రజలను దృష్టిలో పెట్టుకోకుండా కేవలం లాభనష్టాలతో బేరీజు వేసి రేషన్ పంపిణీ వాహనాల ఎండీయూ వ్యవస్థను రద్దు చేయాలని చూడటం దుర్మార్గమన్నారు. అనాదిగా అవినీతి, అక్రమాలు, లంచగొండితనంతో భ్రష్టుపట్టిన ప్రభుత్వ వ్యవస్థలను ప్రక్షాళన చేసి పేద వర్గాలకు ప్రభుత్వ సేవలను మరింత దగ్గర చేస్తూ పారదర్శక పాలనలో భాగంగా గడప వద్దకే ప్రభుత్వ సేవలు అందించటం కోసం 2.70 లక్షల మంది వలంటీర్‌లతో కూడిన గ్రామ వలంటీర్ వ్యవస్థను ప్రారంభించి ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేస్తే ఓర్వలేక మంత్రి మనోహర్ ఎండీయూ వాహనాలను రద్దు చేసేందుకు నిర్ణయించటం సహేతుకం కాదన్నారు. మంత్రి నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

పూర్తి అనుమతుల తర్వాతే విక్రయించాలి

- మొవ్వ ఏడీఏ శ్యామల
- శ్రీకాకుళం, కొడాలి గ్రామాల్లో రూ.3 లక్షల విలువైన 22.45 టన్నుల ఎరువుల విక్రయాల నిలుపుదల

శ్రీకాకుళం(ఘంటసాల): వ్యవసాయ శాఖ ద్వారా పూర్తి స్థాయి అనుమతులు పొందిన తర్వాతే రైతులకు ఎరువులు, పురుగు మందులు విక్రయించాలని మొవ్వ ఏడీఏ ఎస్.శ్యామల ఫెర్టిలైజర్స్ షాపుల యజమానులను హెచ్చరించారు. ఘంటసాల మండలం శ్రీకాకుళం, కొడాలి గ్రామాల్లోని ఎరువులు, పురుగు మందులు, విత్తనాల షాపులను మొవ్వ ఏడీఏ శ్యామల, మండల వ్యవసాయ శాఖ అధికారి కె.మురళీకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పూర్తి స్థాయి అనుమతుల్లేకుండా నిల్వ ఉన్న రూ.3,00,240 విలువైన 22.45 టన్నుల ఎరువుల విక్రయాలను నిలుపుదల చేశారు. అనంతరం ఏడీఏ శ్యామల మాట్లాడుతూ శ్రీకాకుళం, కొడాలి గ్రామాల్లోని ఫెర్టిలైజర్స్ షాపుల యజమానులు ఎరువులకు సంబంధించి పూర్తిస్థాయి అనుమతి పత్రాలను అందజేసిన తర్వాతే సదరు ఎరువులను రైతులకు విక్రయించాలని, అప్పటివరకు ఎలాంటి అమ్మకాలు చేయొద్దని ఆదేశించినట్లు చెప్పారు. ఫెర్టిలైజర్స్ షాపుల యజమానులు విక్రయించే ఎరువులు, పురుగు మందులు, విత్తనాలకు సంబంధించి పూర్తి వివరాలతో బిల్లులను తప్పనిసరిగా రైతులకు ఇవ్వాలన్నారు. షాపుల వద్ద స్టాకు బోర్డు ఏర్పాటు చేసి ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు స్టాకు, ధరల పట్టికను ప్రదర్శించాలన్నారు. పూర్తిస్థాయి అనుమతులు ఉన్న ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను మాత్రమే రైతులు అమ్మాలని షాపుల యజమానులను ఆదేశించారు. ఈ తనిఖీల్లో వీఏఏలు జి.డయానా, జి.రవిచంద్ర పాల్గొన్నారు.



శ్రీకాకుళంలోని ఫెర్టిలైజర్స్ షాపులో తనిఖీ చేస్తున్న ఏడీఏ శ్యామల, ఏఓ మురళీకృష్ణ

బసవయ్య-రత్నమాంబ ట్రస్టు సేవలు అభినందనీయం

ఘంటసాల: తల్లిదండ్రులు బసవయ్య–రత్నమాంబ పేరిట ట్రస్టు ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని ఎన్నారై గొర్రెపాటి రంగనాథ్ బాబు అన్నారు. ఘంటసాల గ్రామానికి చెందిన గొర్రెపాటి బసవయ్య – రత్నమాంబ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వాహకులు గొర్రెపాటి వెంకట రంగారావు, గొర్రెపాటి వెంకట నరసింహారావు (చంటి బాబు) మండల పరిధిలోని మల్లంపల్లి పంచాయతీ శివారు బోళ్లపాడు గ్రామంలో 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థికి ఏటా ఆర్థిక సాయం అందిస్తారు. దీనిలో భాగంగా గత మార్చిలో జరిగిన 10వ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన గ్రామానికి చెందిన లోయ జగదీష్ తల్లిదండ్రులకు ట్రస్టు తరఫున రూ.5 వేల ఆర్థిక సాయాన్ని ఎన్నారై రంగనాథ్ బాబు చేతుల మీదగా శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో మిల్క్ సొసైటీ ప్రెసిడెంట్ గొర్రెపాటి సురేష్, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి రామకృష్ణ, కొండపల్లి రామకృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

దోమల నిర్మూలనతో ఆరోగ్య పరిరక్షణ

కంకిపాడు: దోమల నిర్మూలనతో ఆరోగ్య పరిరక్షణ సాధ్యమని జిల్లా మలేరియా అధికారి రామారావు అన్నారు. ఉప్పలూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మండలంలోని నెప్పల్లి గ్రామంలో డెంగీ వ్యతిరేక మాసం సందర్భంగా దోమల నిర్మూలన చర్యలపై అవగాహన కల్పిస్తూ శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మలేరియా అధికారి రామారావు మాట్లాడుతూ దోమల నిర్మూలనతో వ్యాధులు దరిచేరవన్నారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. వర్షాకాలం కావటంతో దోమలు వ్యాప్తి చెంది డెంగీ, మలేరియా వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. దోమల నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి జీవీవీ శ్రీనివాసరావు, హెల్త్ అసిస్టెంట్లు రాచమళ్ల శ్యాం ప్రసాద్, శ్రీధర్ కుమార్, సీహెచ్‌ఓ బిందుమాధవి, ఏఎన్ఎం విక్టోరియా, ఆశ కార్యకర్తలు ఝాన్సీ, జ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, విద్యార్థులు

11 నుంచి యోగా తరగతులు

కైకలూరు/మండవల్లి: మైసూరు దత్త క్రియా యోగా అంతర్జాతీయ కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు మూడు రోజులు లోకుమూడి గరువు దత్తాశ్రమంలో ప్రత్యేక దత్త క్రియా యోగా తరగతులు నిర్వహించనున్నట్లు దత్తాశ్రమం ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ గురజాడ ఉదయశంకర్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. యోగా తరగతులు ఉదయం 6 నుంచి 8 గంటల వరకు ఉంటాయని పేర్కొన్నారు. ప్రాణాయామం, ఆసనాలు, ధ్యానం, ముద్రలు నాడి శుద్ధి వ్యాయామం నేర్పుతారని తెలిపారు. యోగా తరగతులకు వచ్చే వారికి ఉదయం అల్పాహారం ఏర్పాటు చేస్తున్నామని, ఈ అవకాశాన్ని యోగా ఔత్సాహికులు వినియోగించుకోవాలని కోరారు.

మురుగునీరు నిల్వలేకుండా చర్యలు

పమిడిముక్కల: స్థానిక పంచాయితీ పరిధిలోని గుర్రాల్లంకలో మురుగునీరు నిల్వలేకుండా పంచాయతీ చర్యలు చేపట్టింది. డ్రెయిన్లను శుభ్రం చేశారు. మురుగునీరు నిల్వలేకుండా తొలగించారు. డ్రెయిన్లలో శుక్రవారం బ్లీచింగ్ చల్లారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఏఎన్ఎం లక్ష్మి గ్రామస్తులకు సూచించారు.

సూర్యనారాయణస్వామికి విశేష పూజలు

వేకనూరు(అవనిగడ్డ): మండల పరిధిలోని వేకనూరులో వేంచేసియున్న సూర్యనారాయణస్వామికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. జ్యేష్ఠ బహుళ అమావాస్యను పురస్కరించుకుని ఆగమ పండితులు దీవి బాలకృష్ణమాచార్యులు పర్యవేక్షణలో అర్చకులు స్వామివారికి విశేష అలంకారం, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాన్ని ఆలయ ధర్మకర్త తుంగల వీర వసంతరావు పర్యవేక్షించారు.

జాగ్రత్తలు తీసుకుంటే మామిడి, కొబ్బరి సాగులో లాభాలు

కృత్తివెన్ను: తగిన జాగ్రత్తలు తీసుకుంటే మామిడి, కొబ్బరి సాగులో మంచి లాభాలు గడించవచ్చని ఉద్యాన శాఖాధికారి మానస అన్నారు. మండల పరిధిలోని చినగొల్లపాలెం దీవిలో శుక్రవారం ఉద్యాన తోటల పెంపకాన్ని ఆమె పరిశీలించారు. సన్నకారు రైతులకు ఉపాధిహామీ పథకం ద్వారా ప్రోత్సహిస్తున్న మామిడి, కొబ్బరి సాగు భూములను ఆమె పరిశీలించారు. అనంతరం సచివాలయం వద్ద రైతులతో సమావేశమై సాగులో మెలకువలు వివరించారు. ఉద్యాన పంటలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మొక్కదశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తెగుళ్ల నివారణ కోసం రైతులు అవలంబించాల్సిన పద్ధతులను తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సునీల్, ఎంపీటీసీ సభ్యులు సాధనాల బాబ్జీ, ఎఫ్‌ఏ ఫ్రాన్సిస్, రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి వారాహి నవరాత్రోత్సవాలు

కె.కొత్తపాలెం(మోపిదేవి): కృష్ణానది ఒడ్డున మండలంలోని కె.కొత్తపాలెం గ్రామంలో ఉన్న శ్రీదుర్గా కోటేశ్వరస్వామివారి ఆలయంలో వారాహి అమ్మవారి నవరాత్రోత్సవాలు శనివారం నుంచి వైభవంగా ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు విద్యాసాగర్ శర్మ మాట్లాడుతూ ఈ మహోత్సవాలు ఈనెల 6వ తేదీ నుంచి 14వ తేదీ వరకు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ప్రతి రోజూ ఉదయం 7 గంటలకు అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం, ప్రత్యేక అలంకరణ ఉంటుందని తెలిపారు. 9 గంటలకు ఆలయ ప్రాంగణంలో మహిళలతో సామూహిక కుంకుమార్చన నిర్వహిస్తారని చెప్పారు.

ఆటో బోల్తా : డ్రైవరుకు తీవ్ర గాయాలు

బంటుమిల్లి: మండల పరిధిలోని నారాయణపురం–పెదపట్నం ఆర్‌అండ్‌బీ రోడ్డులో శుక్రవారం రాత్రి జరిగిన ఆటో ప్రమాదంలో డ్రైవరు తీవ్రంగా గాయపడ్డాడు. మండలంలోని ములపర్రు గ్రామానికి చెందిన సుభాష్‌చంద్రబోస్ ఉల్లిపాయల వ్యాపారం చేస్తుంటాడు. శుక్రవారం రాత్రి వ్యాపారంలో భాగంగా ఉల్లిపాయలు లోడు చేసుకుని పెదపట్నం వైపు వెళుతుండగా నారాయణపురం గ్రామ శివార్లలో ఆటో అదుపుతప్పి బోల్తా కొట్టింది. రోడ్డుపై వెళుతున్న వ్యక్తులు ప్రమాదాన్ని గుర్తించి 108 ద్వారా బందరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పోలీసు వారికి ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై ఎటువంటి ఫిర్యాదు రాలేదని ఎస్ఐ వాసు తెలిపారు.

స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలి



స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాము

గుడివాడరూరల్: మన ఊరిని మనం శుభ్రం చేసుకునేందుకు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ముందుకు వచ్చి సహకరించాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కోరారు. స్థానిక ఏలూరురోడ్డులోని టీడీపీ ప్రజావేదికలో పట్టణంలోని స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐలవ్ గుడివాడ అనే కాన్సెప్ట్ ద్వారా క్లీన్ అండ్ గ్రీన్ గుడివాడగా అభివృద్ధి చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ముఖ్యంగా ప్రజలు రోడ్లపై ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా ఉండేలా అవగాహన కల్పించాలన్నారు. పట్టణంలో పరిశుభ్రత, పచ్చదనం పెంపొందించేలా కృషి చేద్దామన్నారు. ఆగస్టు 15న పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలన్నారు. బాగా పని చేసిన స్వచ్ఛంద సంస్థలకు ప్రతి ఏటా రూ.5 లక్షలు, రూ.3 లక్షలు, రూ.2 లక్షలు చొప్పున వ్యక్తిగతంగా ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. పట్టణంలో ప్రాంతాల వారీగా దత్తుతు తీసుకుని పరిసరాల పరిశుభ్రతకు కృషి చేస్తామంటూ పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, బీజేపీ ఇన్‌చార్జి దావులూరి సురేంద్రబాబు పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతులకు ఆక్వా రైతులు ముందుకు రావాలి



గుర్వాయిపాలెంలో రోడ్డు మరమ్మతు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కామినేని

కైకలూరు: ప్రభుత్వ నిధుల కోసం ఎదురుచూడకుండా రహదారుల మరమ్మతులకు ఆక్వా రైతులు సాయం చేయడానికి ముందుకు రావాలని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. కలిదిండి మండలం గుర్వాయిపాలెం–పెదలంక రోడ్డులో గుర్వాయిపాలెం వద్ద ఆక్వా రైతులు, ప్రజలు సాయంతో రోడ్ల మరమ్మతు పనులను శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతి ఆక్వా రైతూ ఆయా గ్రామాల్లో రహదారులు, డ్రెయిన్లు, కాల్వలను బాగుచేసుకోవాలని సూచించారు. అనంతరం కలిదిండిలో మండలం పార్టీ అధ్యక్షుడు పోకల జోగిరాజు అధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కైకలూరు క్యాంప్ కార్యాలయంలో సబ్‌రిజిస్ట్రార్, ఎంఈఓలు, డ్వాక్రా మహిళలు, పీహెచ్‌సీ సిబ్బంది ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమాల్లో కుటమి నాయకులు తాడినాడ బాబు, వల్లభనేని శ్రీనివాసచౌదరీ, చిట్టూరి రవీంద్ర, సారిక వెంకటేశ్వరరావు, యార్లగడ్డ రవి, పేటేటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చినుకుపడితే చిత్తడే



కైకలూరు టౌన్ హాల్ సమీపంలో రహదారిపై చేరిన వర్షం నీరు

కైకలూరు: చినుకుపడితే కైకలూరులో ప్రయాణికులకు దడ పట్టుకుంటోంది. పామర్రు–దిగుమర్రు జాతీయ రహదారి ఇరువైపులా డ్రెయినేజీ వ్యవస్థ దెబ్బతింది. శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షానికి డ్రెయిన్లు పొంగి రోడ్డుపైకి చేరాయి. దీంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడ్డారు. అలాగే వెలంపేట కాలనీలో చిన్నపాటి వర్షానికే డ్రెయిన్లు పొంగిపొర్లుతున్నాయి. రోజుల తరబడి కాలనీ వాసులు బురద నీటిలో నడుస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

9న అవనిగడ్డలో జాబ్‌మేళా

అవనిగడ్డ: గ్రామీణ యువజన వికాస సమితి, అంజనాస్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 9వ తేదీన అవనిగడ్డ గాంధీక్షేత్రంలో జాబ్‌మేళా కార్యక్రమం నిర్వహించనున్నట్లు వికాస సమితి అధ్యక్షుడు మండలి వెంకట్రామ్, ఫౌండేషన్ చైర్మన్ బచ్చు నవీన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అపోలో ఫార్మసీ, టాటా టెక్నాలజీస్, స్పైడర్ ఎలక్ట్రిక్, సుప్రజీత్ ఇంజినీరింగ్, మదర్ సన్ సుమి సిస్టమ్స్, అంబెనాల్, రిలయన్స్ డిజిటల్ వంటి కంపెనీల్లో 800కు పైగా ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఈ జాబ్‌మేళా కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా పూర్తి చేసిన వారు ఈ జాబ్‌మేళాకు హాజరు కావచ్చని చెప్పారు. మరిన్ని వివరాల కోసం 92906 89808 నంబర్‌కు ఫోన్ చేసి వారి పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

విద్యుత్ సంస్థ యాప్ ద్వారా బిల్లులు చెల్లించండి

మచిలీపట్నంటౌన్: విద్యుత్ వినియోగదారులు బిల్లులను విద్యుత్ సంస్థ యాప్ ద్వారా చెల్లింపులు చేయాలని ఆ సంస్థ మచిలీపట్నం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం. భాస్కరరావు సూచించారు. నగరంలోని భాస్కరపురంలో శుక్రవారం రాత్రి వినియోగదారులకు యాప్ ద్వారా బిల్లుల చెల్లింపుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ ఇకపై యుపీఐల ద్వారా కాకుండా ఏపీసీపీడీసీఎల్ సంస్థ రూపొందించిన యాప్, వెబ్‌సైట్‌ల ద్వారా మాత్రమే బిల్లులు చెల్లించాలన్నారు. ప్లే స్టోర్‌లో ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని సులువుగా విద్యుత్ బిల్లులను చెల్లించవచ్చునన్నారు. పేటీఎం, ఫోన్‌పే, గూగుల్ పే, అమెజాన్ పే వంటి యూపీఐ యాప్‌ల ద్వారా కాకుండా తమ సంస్థ యాప్ ద్వారా నేరుగా చెల్లించాలన్నారు. సమావేశంలో విద్యుత్‌శాఖ ఏడీఈ రామకృష్ణ, ఏఈ రమణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈఈ భాస్కరరావు

రామాలయంలో చోరీ

గూడూరు: మండలంలోని తరకటూరు గ్రామంలో ఉన్న శ్రీ కోదండ రామాలయంలో దొంగలు పడ్డారు. గురువారం రాత్రి సమయంలో గుడి తాళాలు పగలగొట్టిన దుండగులు ఆలయంలోని స్వామి వార్లకు చెందిన వెండి ఆభరణాలు ఎత్తుకు వెళ్లారు. ఉదయం స్వామి వారికి పూజా కార్యక్రమాలు నిర్వహించడానికి వచ్చిన అర్చకుడు బృందావనం ఆది శేషాచార్యులు ఆలయ తాళాలు పగలగొట్టి ఉండటాన్ని గుర్తించారు. వెంటనే ఆలయ కమిటీ సభ్యులకు సమాచారం ఇవ్వగా, కమిటీ సభ్యుడు గళ్లా మురళీ కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గూడూరు ఎస్ఐ ఐ.వీర్రాజు, సిబ్బంది ఘటనాస్థలానికి వచ్చి ఆధారాలు సేకరించారు. దేవతామూర్తులకు చెందిన 8 వెండి కిరీటాలు, వెండి పళ్లాలు, శఠగోపురం, మంగళసూత్రాలు వంటి దాదాపు నాలుగు కిలోల వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
గుడివాడ డివిజన్
99516 02865 (గుడివాడ)
99516 02985 (కైకలూరు)
90105 77706 (పామర్రు)
Office mail : sakshiads@gmail.com